మద్రాసు–దాదర్ ఎక్స్‌ప్రెస్ కడప స్టేషన్‌కు గంట ఆలస్యంగా వచ్చింది. ట్రెయిన్ ఎంత లేటయితే ప్రయాణికులు అంత ఎక్కువగా ఉండడం సాధారణం. స్టేషనంతా హడావిడిగా ఉంది. దిగే వాళ్ళను ఎక్కేవాళ్ళు దిగనీయరు. వాళ్ళు దిగకుండానే వీళ్ళు ట్రెయిన్ ఎక్కాలంటారు. అక్కడ ఘర్షణ, నెట్టుకోవడాలు. ఈ సందట్లో పిక్‌పాకెటీర్ల గుట్టు చప్పుడు లేని సందడి. టీ, కాఫీలు అమ్మేవాళ్ళ గోల.

నా చేతిలో బొంబాయి టిక్కెట్టు ఉంది. త్రీ టయర్ కోచ్‌లో బెర్త్ రిజర్వేషనూ ఉంది. అయినా కంపార్ట్‌మెంటులో అడుగు పెట్టడమే ప్రళయమైంది. రిజర్వేషన్ ఉన్న వాళ్ళకు బెర్త్ నంబర్లు ఇచ్చి క్రింద నిలబడిన టి. టి. ఇ. కంపార్ట్‌మెంట్‌లో ఎక్కాడు. అప్పటికే ఏ రిజర్వేషనూ లేనివాళ్ళు చాలామంది ఎక్కి స్థలమున్నచోటల్లా కూర్చున్నారు. మరి కొంతమంది నిలబడి ఉన్నారు. "రిజర్వేషన్ లేనివాళ్ళు దిగి మరో కంపార్ట్‌మెంటుకు వెళ్ళండి. నో వేకెన్సీ. ప్లీజ గెడవున్!" అంటున్నాడు టి. టి. ఇ. కాని, దిగే వాళ్ళు లేకపోగా ట్రెయిన్ కదిలే సమయానికి మరో నలుగురు ఎక్కి నిలబడ్డారు. ఈలోగా టి. టి. ఇ. పాట పాడుతూంటాడని ప్రయాణికులకు తెలుసు. ఇదంతా లోపాయికారి వ్యవహారమని అందరికీ తెలుసు.

ట్రెయిన్ కదిలింది. బత్తాయీల బుట్టతో ఒకరు, వేరుశనక్కాయల బుట్టతో ఒక కుర్రవాడు కదిలి వెళుతున్న ట్రెయిన్‌లో ఎక్కారు. కంపార్ట్‌మెంటులో ఎక్కినవాళ్ళు సర్దుకొని కూర్చుంటున్నారు. నాకు డోర్‌వే పక్కనే అప్పర్ బెర్త్ ఇచ్చారు. బెర్త్ మీద నా సూట్‌కేసు, బాగ్ ఉంచి క్రింది కిటికీ పక్కనే ఉన్న లోయర్ బెర్త్ మీద కూర్చున్నాను. కంపార్ట్‌మెంట్‌లో కోలాహలం చాలావరకు తగ్గింది. నాకు పక్కగా సైడ్ లోయర్ బెర్త్ మీద ఇద్దరు వ్యక్తులు కూర్చొని ఉన్నారు. వారిలో ఒకరు ఏ రాజకీయ నాయకుడో లేక సంఘ సంస్కర్తో అయి ఉంటాడని ఆయన వేషమే చెపుతూ ఉంది. ఆయన తన పక్కన కూర్చున్న మరొకాయనతో పెద్దగా మాట్లాడుతున్నాడు.

". . . అందుకే నేను చెపుతున్నది. ఇలాంటి వాళ్ళను చిత్రవధ చేయాలి. లేకపోతే ఈ దేశంలో ఆడవాళ్ళు ఇక బ్రతకలేరు. ఆడమనిషికీ ఆత్మాభిమానం ఉందనీ, హృదయముందనీ అనుకుంటున్నారా చెప్పండి ఈ మనుషులు? అబ్బబ్బ! ఎన్ని మానభంగాలు, ఎన్ని హత్యలు! గుండె తరుక్కుపోతూ ఉందండి. నిన్నటికి నిన్న మా ఊళ్ళో మొదటి సినిమాకు పోయి వస్తున్న ఒక ఆడకూతుర్ని బలవంతంగా కొందరు—రామ రామ ఏం చెప్పమంటారండి..." రాజారామ్ మోహన్‌రాయ్, వీరేశలింగం లాంటివాళ్ళు మరణించి ఈయన హృదయంలోనే మరల పుట్టారా అనేటట్లుగా ఆవేశంతో అనర్గళంగా ఉపన్యసిస్తున్నాడు.

"బత్తాయీలండీ బత్తాయిలు—కోడూరు బత్తాయిలు. సీ విటమిన్ లడ్డులండీ, వీటి రసం అమృతమండీ. రెండు పళ్ళరసం తాగితే చాలు—బొంబాయి పోయేదాకా అన్నమక్కర్లేదండీ, సార్! అలసిస్తే ఆశాభంగం. రూపాయికి నాలుగు, సార్! డజనైతే రెండున్నరండీ!" అంటూ బత్తాయీ లమ్మే అతను కేకలేస్తూ కంపార్ట్‌మెంటులో తిరుగుతున్నాడు.

"సార్! వేరుశెనక్కాయలు కావాలా. గిద్ద పావలా. అరగిద్ద పదిహేను పైసలు, కాల్ గిద్ద పది పైసలు, సార్! కాయలు వేడిగా ఉన్నాయ్, సార్" అంటూ వేరుశనక్కాయల కుర్రవాడు ప్రతి సీటు దగ్గరికి వెళ్ళి అందర్నీ అడుగుతున్నాడు. వాడి కళ్ళలో ఉన్న ఆకర్షణ, ప్రతివాళ్ళనూ వాడు అడిగే పద్ధతి చాలా ముచ్చటగా ఉన్నాయి, వాడు అమ్మే వేరుశనక్కాయల రుచికంటే. కంపార్ట్‌మెంట్ అంతా తిరిగి నా సీటు పక్కనే డోర్ దగ్గర కూర్చున్నాడు. బుట్టలో దోసెడు కాయలున్నాయి.

# ఈ హత్యకు శిక్షలేదు

—డాక్టర్ జె. వి. సుబ్బరాయుడు

ఆ కుర్రవాడికి పది పదకొండేళ్ళు ఉంటాయి. సన్నగా, పీలగా ఉన్నాడు. చక్కగా తీర్చిదిద్దిన కళ్ళు. అమాయకమైన నవ్వు ఆ కళ్ళలో కనిపిస్తూ ఉంది. కోలముఖం. భుజంమీద చిరిగిన అరచొక్కా వేసుకో ఉన్నాడు. చొక్కాయి బాగా మాసిపోయి ఉంది. ఆ చొక్కాయి గుండీల్ని తారుమారుగా పెట్టుకో ఉన్నాడు. గుండీలు లేని ఖాకీ నిక్కరు జారిపోతూంటే ముడి వేసుకుంటున్నాడు. ఆ నిక్కరు జారకుండా మొలతాడుతో బిగదీస్తున్నాడు. వెంట్రుకలు ముఖంమీద పడుతూంటే మాటి మాటికి సర్దుకుంటున్నాడు. పడిశం పట్టి ఉందేమో ముక్కు తుడుచుకుంటున్నాడు, చొక్కాయి పైకెత్తి. ఆ కుర్రవాడు చొక్కాయి పైకెత్తినప్పుడు అతని పొట్ట వీపుకి అంటుకో ఉండడం కనిపిస్తూ ఉంది.

ఇంతలో ట్రెయిన్ కొండాపురం స్టేషన్లో ఆగింది. డోర్‌వేకు అడ్డంగా నిలబడి ఉన్న అయిదారుమంది అక్కడ దిగారు. నా పక్కను రెండుసీట్లు ఖాళీ అయ్యాయి. ఒక లావుపాటాయన, భార్య, ఇద్దరు బిడ్డలతో కంపార్ట్‌మెంట్‌లో ఎక్కి నా పక్క సీట్లను ఆక్రమించుకున్నాడు. వాళ్ళ వెనక మరో అయిదారుమంది మగాళ్ళు ఎక్కి, డోర్ దగ్గర నిలబడ్డారు.

"సార్! మీరు రెక్కడికి పోతున్నారు?" అడిగాడు నా పక్కను కూర్చున్న లావుపాటి వ్యక్తి.

"బొంబాయి."

"మేము తాడిపత్రిలో దిగుతాంలెండి—పై బెర్త్ మీదేనా?"

"అవునండీ."

"ఈ సూట్‌కేస్ పైన పెట్టుకోవాలండీ?"

"అయ్యో! నిరభ్యంతరంగా."

మనం జీవితంలో కేవలం ఒక్కసారి మాత్రమే యౌవనులుగా ఉంటాము. అంతకు మించి సహించే శక్తి సమాజానికి లేదు.

—బి. బి.

"మీకు చాలా ఇరుగ్గా ఉందికదూ మావల్ల?"

"ఫర్వాలేదులెండి. ఒక అరగంటలో మీరు దిగుతారుగా?" అన్నాను నేను.

ఆయన తల ఊపి సన్‌డే మాగజైన్‌లో తలదూర్చాడు. వేరుశనక్కాయల కుర్రవాడు తన దగ్గర ఉన్న చిన్న డబ్బితో ఆ బుట్టలో ఉండే దోసెడు కాయల్ని కొలిచాడు. ఏదో వేళ్ళమీద లెక్కలు వేసుకుంటున్నాడు. ఇంతలో అక్కడ నిలబడిన ఒకరు—



## నేను ఎవరు?

ఒకాయన కొత్తగా తాగడం అలవాటు చేసుకుని, రాత్రి పూట ఒక ఇంటి తలుపు తట్టాడు. ఆ ఇంటి ఇల్లాలు తలుపు తెరిచింది.

"క్షమించండి, కృష్ణమూర్తిగారి ఇల్లు ఎక్కడో తెలుసా?" అడిగాడు.

ఆమె ఆశ్చర్యపోయి— "అయ్యో! ఇది మన ఇల్లేనండి. లోపలకు రండి. ఎవరైనా చూస్తే బాగోదు" అంది.

"ఆ సంగతి నాకూ తెలుసు. కృష్ణమూర్తిని నేను అవునో, కాదో తెలుసుకుందామని అడిగాను" అన్నాడు తూలి పడబోతూ.

---

"ఏరోయ్ సూరిగా! కాయలన్నీ అమ్మేసినట్లుందే?" అన్నాడు.

"కాసినున్నాయి ఇంకా" అంటూ వాడు నిక్కరు జేబులోంచి చిన్న గుడ్డ సంచి తీశాడు.

"రెండు కాయలిట్లా పెట్టరా" అన్నాడు ఇందాకటాయన. ఆయన చేతిలో టిఫిన్ డబ్బా ఉంది. చదువుకున్నవాడే. కొండాపురంలో ఉద్యోగం చేస్తూ, సాయంకాలానికి తాడిపత్రికో, ఆ పై నూరికో వెళ్ళే సీజన్ టికెట్ హోల్డర్‌లాగా ఉన్నాడు. అతనిపక్కనున్న మిగత నలుగురూ అలాంటివాళ్ళుగానే కనిపించారు నాకు.

సూరిగాడు రెండుకాయలు ఆయన చేతిలో పెట్టాడు. ఆ కాయల్ని ఒలిచి తింటూ ఆయన పక్కనతన్ని తట్టి "రామారావ్! వీడెవడో తెలుసా?" అని సూరిగాణ్ణి చూపిస్తూ అన్నాడు.

సూరిగాడు గుడ్డ సంచిలో ఉన్న డబ్బుల్ని క్రిందపోసి లెక్కవేస్తున్నాడు. అందులో రెండు రూపాయి కాయితాలు, ఒక అర్ధ రూపాయి, ఒక పావలా, మరికొంత చిల్లర ఉంది. అంతా లెక్క వేసి, సంచిలో వేసుకున్నాడు. దానికి దారం బిగదీసి మూటగా కట్టి నిక్కరు జేబులో ఉంచాడు. వేళ్ళ మీద లెక్క వేసుకుంటూ, "సరిపోయిందిలే" అన్నట్లు తల ఊపాడు.

"ఎవడు, సుందరం, వీడు? నాకు తెలీదే!" అన్నాడు రామారావు.

"వీడి దో భాగోతంలే—ఒరేయ్ సూరిగా! కాసిని కాయలు పెట్రా." సుందరం దబాయింపుగా అడిగాడు.

సూరిగాడు కాయల్ని క్రిందపోసి చచ్చువాటిని ఏరివేస్తూ, "ఇంకా సలబై పైసల కాయలున్నాయి, సార్! నాలుగున్నర రూపాయలకు పది పైసలు తగ్గినా మాయమ్మ కొడద్ది, సార్" అంటూనే మరో నాలుక్కాయలు సుందరం చేతిలో పెట్టాడు.

ఆ మాటను వినేసరికి నాకు జాలి కలిగింది. ఇంతకుముందు పావలా కాయలు కొన్నా, మరల ఇప్పుడొక పావలా కాయలు కొన్నాను.

"సూరిగా! మీ యమ్మ ఏం చేస్తున్నదిరా తాడిపత్రిలో?" సుందరం అడిగాడు.

"ఏం చేయుటంలే."

"వ్యాపారం చేయుటంలే ఇప్పుడు?"

"సేయుటంలే." చచ్చుకాయల్ని ఏరి వేస్తూనే అన్నాడు సూరిగాడు.

"నాయాలా! అబద్ధం చెప్పకురా. ఫాన్సీ కొట్టు రంగయ్య మీ ఇంటికి రావడంలే ఇప్పుడు?" అన్నాడు సుందరం. సూరిగాడు ఏమీ మాట్లాడకుండా తల వంచుకుని కూర్చున్నాడు, కింద ఉన్న గిద్దెడు కాయల్ని బుట్టలో పోసుకుని.

"ఓన్ వీడా! నా కెందుకు తెలీదు? మా ఇంటి పక్కన ఆఫీసరింట్లో పాచిపని చేసిందిగా కొన్నాళ్ళు వీడమ్మ?" అన్నాడు రామారావు జామిట్రీలో ఏదో థీరమ్ గుర్తు రాక కొంత సేపు తంటాలు పడి గుర్తు తెచ్చుకున్న వాడిలా చిటిక వేస్తూ.

"అయితే నీకూ తెలుసన్నమాట! పరిచయం ఏం లేదా?"

"ఆఫీసరు ఒంటరిగా ఉండేవాడులే. గుంటూరు నుంచి తాడిపత్రికి ట్రాన్స్‌ఫర్ అయిన కొత్తల్లో." రామారావు పెద్దగా నవ్వుతూ అన్నాడు.

"ఒరే సూరిగా! మీ నాయన ఎక్కడుండాడ్రా?" అన్నాడు సుందరం.

సూరిగాడు మోకాళ్ళ మీద తల ఆన్చుకుని దిగాలుగా కూర్చున్నాడు.

"చెప్పరా నాయాలా! మీ యమ్మ మీ యబ్బను తన్ని ఎళ్ళగొట్టిందటనే? నిజమేనట్రా? బెల్లం కొట్టిన రాయిలా కూర్చుని పలకనేంరా?"

"నాకు తెలవదు." అమాయకంగా అన్నాడు సూరిగాడు.

"రామారావూ! వీడి నాయన కొయ్యపని చేసేవాడు తాగి తాగి డబ్బు తగలేస్తూంటే వీడి అమ్మ మొగుణ్ణి తన్ని తగలేసింది. పీడ పోయిందని సుఖంగా ఉన్న దిప్పుడు" అన్నాడు సుందరం.

"ఒరేయ్! నువ్వు వీరిగాడి కొడుకువట్రా! మీ నాయన్ని పొట్టన బెట్టుకున్నది మీ యమ్మ! దాన్ని నరికి కాకులకు, గద్దలకు వెయ్యాల్రా పాడు ముండను! ఎందు కులే అని వూరుకున్నాను కాని. . ." సంఘసంస్కర్త మధ్యలో జోక్యం చేసుకుని సూరిగాణ్ణి ఉరిమి చూస్తూ అన్నాడు.

"ఏమండీ! మనం ఇల్లు కట్టించేప్పుడు కొయ్య పని చేస్తూ కనపడకుండా పోయాడే వీరయ్య— మీరు అడ్వాన్సుగా వంద ఇచ్చారూ? మనకు పని ఎగేసి పోయినాడుగా చచ్చినాడు? వాడి కొడుకులా ఉన్నాడండీ వీడు." నా పక్కను కూర్చున్న లావుపాటి ఆయన్ను తట్టి తట్టి చెపుతున్నది ఆయన భార్య.

"పోనీలే, కళావతీ! ఇప్పుడేం చేస్తాం?" అన్నాడాయన.

"సూరిగా! ఎక్కడ్రా మీ ఇల్లు?" అడిగాడు రామారావు.

"శివాలయం కాడ."

"శివాలయం వీథిని పావనం చేద్దామని అక్కడ చేరారన్నమాట!" అన్నాడు సుందరం.

"మన వీథిలోనే చేరిందటండీ వీళ్ళమ్మ! అది వట్టి పాడు ముండటండీ. ఇప్పటికి నలుగుర్ని. . ." అన్నది కళావతి, భర్త చేతుల్లో ఉన్న మాగజైన్ను పక్కకు లాగేస్తూ.

"అబ్బ! పోనీ, కళావతి! మన కెందుకు? మనం పెట్టి వాళ్ళను పోషించడం లేదుగా?" అన్నాడాయన.

"సంసార్లున్న వీథిలో ఈ ముక్కిడి గుంపేమిటండీ! మీరు పోలీసులకు చెప్పి మన వీథినుంచి . . ." కళావతి మాటలకు మధ్యలోనే అడ్డు వచ్చి—

"శేవదీయమంటావ్. అంతేనా? సరేలే. వూరికి వెళ్ళిన తరవాత చూద్దాం" అన్నా డాయన.

"మొగుణ్ణి వెళ్ళగొట్టినాక ఫాన్సీ కొట్టు రంగయ్యను కొంగున ముడేసుకున్నది. ఇప్పుడు రంగయ్యను కూడా తరిమేసి పబ్లిక్ వ్యాపారం పెట్టింది." సుందరం అన్నాడు.

"యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః అని ధర్మశాస్త్రం చెపుతున్నది. కానీండి. ఆ స్త్రీలు వేరు, వాళ్ళ సద్గుణాలు వేరు. మొగుణ్ణి కొట్టి మొర పెట్టుకునే ఇలాంటి దగుల్బాజీ ముండల్ని కత్తికో కండ చెయ్యాలండీ." సంఘ సంస్కర్త తన కున్న ధర్మశాస్త్ర పరిజ్ఞానాన్ని ఒలకబోశాడు.

సూరిగాడు వీళ్ళందరి మాటల్ని తల వంచుకుని వింటూనే ఉన్నాడు. వాడి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. పెద్దగా ఏడవలేక పోతున్నాడు. కాని, కళ్ళ నీళ్ళు చెంపల మీద కాలువలు కట్టూతూ బుట్టలో ఉన్న వేరుశనగకాయల్ని తడుపుతున్నాయి. చెయ్యిపైకెత్తి భుజంతో కళ్ళు తుడుచుకుంటున్నాడు. చొక్కాయి పైకెత్తి ముక్కు తుడుచుకుంటున్నాడు. ఉన్నట్టుండి లేచి కిటికీ లోంచి బయటికి తొంగి చూశాడు. ఇంకా ఎంత దూరం తన వూరికి అని తెలుసుకొన

డానికేమో? బుట్ట అక్కడ ఉంచి లావెట్రీలోకి వెళ్ళాడు. కొద్ది సేపైన తరవాత వెలుపలికి వచ్చాడు. వాడి కళ్ళు ఉబ్బి ఉన్నాయి. ముఖం కందిపోయి ఉంది. బుట్ట చేతిలోకి తీసుకున్నాడు. ఆ బుట్టలో పిడికెడు కాయలు మాత్రమే ఉన్నాయి.

"ఒరే సూరిగా! నేను తీసుకున్నానురేరా అర గిద్దెడు కాయలు. పదహైదు పైసలు రేపిస్తాలే. అప్పిచ్చానని మీ యమ్మతో చెప్పు. నిన్ను తన్నదులే" అన్నాడు సుందరం, కాయలు వలిచి తింటూ. సూరిగాడు బుట్టలో చేయి ఉంచి వేళ్ళతో ఆ పిడికెడు కాయల మధ్య గీస్తున్నాడు. డబ్బివ్వకుండా కాయలు తింటున్నారని వాడికేమీ అనిపించ లేదిప్పుడు.

"సుందరం! మరి వీడెవరి కొడుకు?" అన్నాడు రామారావు వెక్కిరింపుగా.

"వాళ్ళమ్మ కొడుకు. కొన్ని సొసైటీస్‌లో తల్లే కాని, తండ్రికి ప్రాధాన్యం లేదు. మేట్రియార్కల్ థీరీ అని ఒకటున్నదిలే. నీకు తెలీదేమో!" తనకు సోషియాలజీలో, పొలిటికల్ థీయరీస్‌లో గొప్ప ప్రవేశం ఉన్న వాడులా గంభీరంగా అన్నాడు సుందరం.

"సూరిగా! మీ యమ్మతో ఇప్పు డెవ్రరా ఉండేది?" రామారావు అన్నాడు.

"నే. . .నే. . ." ఏడుస్తూ అన్నాడు సూరిగాడు.

"ఆ ముండకేం సిగ్గా ఎగ్గా! అయ్యో! అయ్యో! కొడుకుతోకూడ. . . ఛీ ఛీ! పాడు ముండ. ఆ బతుకు బతికే కన్న ఏ బావిలో నన్నా దూకి చావ కూడదూ?" వాని వరసల్ని వయోభేదాన్నికూడా గమనించకుండా నోటిమీద వేలు వేసుకుని కళావతి తిప్పగా అన్నది భర్తతో.

సూరిగాడికి ఈ మాటలు వినిపించాయి. వాడి కళ్ళు గిర్రున తిరిగి పోతున్నాయి. వాళ్ళను ఎదిరించే శక్తి తనకు లేదు. వాళ్ళ మాటలను జీర్ణం చేసుకోనూ లేడు. చొక్కా పైకెత్తి కళ్ళు తుడుచుకుంటూ బుట్టను ఒక చేత్తో పట్టుకుని ఒక చేత్తో డోర్ తీశాడు.

"సూరిగా! మీ ఇల్లు చూపిస్తావ్రటా నాకు?" రామారావు వాడి భుజం తట్టి అన్నాడు. వాడేమీ పలకలేదు. కళ్ళ నీళ్ళు మాత్రం కాలువలై ప్రవహిస్తున్నాయి వాటి చెంపల మీద.

ట్రాక్ రిపేర్ చేస్తున్నందువల్ల ట్రెయిన్ నెమ్మదిగా వెళుతూ ఉంది. సూరిగాడేమనుకున్నాడో డోర్ దగ్గిరికి వచ్చాడు. దిగి మరో కంపార్టుమెంటులో ఎక్కాలనుకున్నాడేమో? ఒక చేతిలో బుట్ట, మరొక చేత డోరు పక్కనున్న ఇనుప పూచ పట్టుకున్నాడు. ఒక కాలు మెట్టు మీద ఉంది. రెండవ కాలుకూడా మెట్టు మీద ఉంచి వూగాడుతూ ఒక కాలును నేల మీద ఉంచి దిగాలనుకున్నాడు. చేయి జారింది. కాలూ జారింది. వాడి జీవితమూ జారింది. శనక్కాయల బుట్ట దొర్లుకుంటూ దూరంగా వెళ్ళి పడ్డది. వాడికి ఎక్కడ ఏం దెబ్బ తగిలిందో వెల్లకిలా పడిపోయాడు. జేబులో ఉన్న డబ్బుల సంచి వాడి పక్కనే జారి పడ్డది.

"సూరిగాడు చచ్చినట్టుంది. చెయిన్‌లాగండి." దయా దాక్షిణ్యాలను ఒలక బోస్తూ అన్నాడు సుందరం.




"ఆఁ పోనీండి. ఈ లాంటి వాళ్ళు భూమికి భారం." సంఘ సంస్కర్తగారు ఉవాచ.

"చ్ చ్ చ్ అయ్యో పాపం!" అంటూ కంపార్టుమెంట్‌లో కూర్చున్న వాళ్ళు కిటికీ లోంచి తొంగి చూచారు. ట్రెయిన్ కొంత దూరం వెళ్ళి నిలిచింది.

సూరిగాడు చచ్చిపోయాడు. కాని, ఇది హత్యా లేక ఆత్మహత్యా? ఇది హత్య అయ్యేటట్లయితే ఎవ రీ హత్య చేశారు? ఈహత్యకు శిక్ష లేదా—లేదు. మనుషులే ఎదక్క పోతే మనుషులు సృష్టించిన క్రిమినల్, పీనల్ కోడ్లు ఎలా ఎదుగుతాయి? ★